# రాత్రివేళ

1939 సెప్టెంబరు మొదటివారం. ప్రపంచమంతా అట్టుడికినట్లు వుడికిపోతోంది. ఆవరిస్తూవున్న యుద్ధ మేఘాలు గాఢంగా కమ్ముకుంటున్నాయి.

జర్మన్ ప్రజలకి పోలిష్‌జాతివారు చేస్తున్న అపచారానికి తిరుగుజవాబు చెప్పకుండా జర్మనీ యిక వోపిక పట్టలేదంటూ హెర్ హిట్లర్ తన సహజధోరణిలో జర్మన్ సేనలకి ఒక సందేశం వినిపించాడు.

తను పోలెండుకి అంతకి పూర్వం యిచ్చిన అభయాన్ని అనుసరించి సెప్టెంబరు మూడో తేదీన బ్రిటన్ యుద్ధంలో దిగింది. అంతటితో రెండవ ఐరోపా మహా సంగ్రామం ప్రారంభమయినట్లే!

సెప్టెంబరు అయిదో తారీఖు రాత్రి కాబోలు—నేను యింటికి చాలా ఆలశ్యంగా వచ్చిన మాట వాస్తవమే! సుమారు పదకొండున్నర అవుతుంది.

వీధి తలుపు తట్టాను. లోన గడియ వేసి వుంది. కిటికీ రెక్కలు లోపలికి తోసి చూశాను. శాంతాదేవి వాలుకుర్చీలో పడుకొని నిద్రపోతోంది. ఆమెకి మూడడుగుల దూరంలో వున్న టీపాయి మీద పాలగిన్నె ఒకానొక తెలుగుమాసపత్రిక మూతగా కలిగినటువంటిదై వుంది. ఒక మార్జాలం—దాన్ని నల్లమచ్చల తెల్లపిల్లి అనాలో, తెల్లమచ్చల నల్లపిల్లి అనాలో నాకు తెలీదు-పక్కని వున్న కిటికీలో నుంచి ఆ టీపాయి మీదికి జాగ్రత్తగా దూకి వుంటోంది-ఆ గిన్నెలోని పాలు కాసినీ

దాహం పుచ్చుకుందామనే సంకల్పంతో, మూతగా వున్న పుస్తకాన్ని మెల్లిమెల్లిగా వో త్రిగిస్తూ కార్య సాధనకి తగుప్రయత్నం చేస్తోంది. మా బిరువా వెనక స్థిరనివాసం ఏర్పరచుకొన్న ఒక మూషికరాజం, తన ఆవరణలో నుండి ఒక్క తఫా బయటికి వచ్చేసి, తన కంటె అన్నివిధాలా బలవంతుడయిన శత్రువు వునికిని గమనించి, ప్లాను ప్రకారం వెనక్కు వెళ్ళిపోయింది.

రాత్రివేళ ఆలస్యంగా వచ్చిన భర్త భార్యని ఎంత మృదువుగా తన చతురత్వాన్నంతా వెలిబరుస్తూ పలకరించాలో అంత నెమ్మదిగానూ "శాంతా!" అని పిలిచాను

ప్రపంచంలో, ప్రపంచంలోనే లెండి, కొంత మంది మనుషులకి పక్క మీాద పడుకుని ఎంత సేపు దొర్లినా, కంటి మీాదికి కునుకే రాదు. కొందరికి పక్క చూడగానే ఆవులింతలు వస్తాయి. ఏది మంచి దంటే చెప్పలేను. రెండూ మంచివే, రెండూ చెడ్డవే. కాని, శాంతాదేవిలా మొద్దునిద్దర పోవడం మాత్రం మంచిదని అనను. వొళ్లు తెలీని గాఢనిద్ర దేహానికీ మెదడుకీ ఆరోగ్యకరమని డాక్టరు చెప్పొచ్చును గాని, ఆయన భార్యకి అలాటి మొద్దు నిద్రపోయే అలవాటు వుంటే గాఢనిద్ర వల్ల సంభవించే చిక్కులు ఆయనకి స్వానుభవరూపంలో తెలుస్తాయి. శాంతాదేవి గుర్రుపెట్టదు గాని, కుంభకర్ణ నిద్రపోతుంది.

"శాంతా!" అని యింకోసారి, కంఠస్వాయి మార్చి పిలిచాను.

శాంతాదేవి "ఊఁ" అని దీర్ఘంతో అంటూ తెరుపులకి రాబోతున్న కళ్ళని బద్ధకంతో మూసుకుంది.

ఈ సారి టీపాయి మీద కూచున్న పిల్లి కిటికీ వెనకాల వున్న నన్ను తీక్షణంగా చూసి, నా అప్రస్తుత ప్రవేశానికి విముఖత చూపిస్తున్న దానిలా 'మ్యావు' అంటూ టీపాయి మీద నుంచి ఒక్క దూకు దూకింది. ఆ దూకడంలో పిల్లి కాలు ప్రమాదవశాత్తూ గిన్నెకు తగలడమూ, ఆ గిన్నె దభీమని శబ్దంతో బోర్లగిలా పడడమూ పాలు నేలపాలు అవడమూ, శాంతాదేవి వులిక్కిపడుతూ లేవడమూ, కిటికీవూచలు పట్టుకునుంచున్న నన్ను వుద్దేశించి 'ఇల్లు కనిపించిందా' అని నిలవదీసి ప్రశ్నించడమూ, చిరాకుతో వీధి తలుపు గడియ తియ్యడమూ, తత్ప్రయత్నంలో చూపించిన కోపోద్రేకమయిన తొందర ఫలితంగా ఆమె వేలు యినుప గడియలో పడి నలగడమూ, నేను జాంబక్ యిత్యాదులు వాడడమూ-ఇవన్నీ ఒకటి తర్వాత ఒకటిగా వ్యవధిలేకుండా జరిగినై.

వలికిన పాలు మెత్తుకోవడమూ, నా స్నానమూ, కంచాలలో వడ్డించడమూ వగయిరాలన్నీ యథావిధిగా జరిగి మేము భోజనాలకి కూచునేటప్పటికి పన్నెండున్నర అయింది. సావిట్లోని గడియారం అప్పుడే అరగంట కొట్టింది.

ఎడంచేత్తో నెయ్యి వడ్డిస్తూ శాంతాదేవి అంది. "చూశారా, యిప్పుడు పన్నెండున్నర అయింది. ఈ పనంతా చక్కబెట్టుకుని పక్క మీదికి వరిగేటప్పటికి ఒకటిన్నర అవుతుంది. మనింట్లో కార్యకరాదు లన్నీ

నిశాచరవ్యవహారాలలా పరిణమిస్తున్నాయి."

"ఇవ్వాళ తలవని తలంపుగా ఆలశ్యం అయింది. రోజూ ఇంత లేటుగా వస్తున్నానా ?"

ఆమె చాకులో వుప్పువెయ్యడం ఎన్నిసార్లు మర్చిపోలేదు ?—నేను ఎన్నిసార్లు క్షమించలేదూ !

"ద్వితీయ ఐరోపా మహాసంగ్రామం ఆరంభమయింది-విన్నావు గదూ ?" యుద్ధ విషయాలు పుట్టించగలిగేటంత వుద్రేకమూ ఆసక్తి యితర విషయాలు జనింప జెయ్యలేవని భ్రమిస్తూ సంభాషణని అంతర్జాతీయ రంగంలోకి మార్చాను."

"విన్నా," అంది ముభావనగా.

శాంతాదేవికి రాజకీయ విషయాలు అంతగా తెలీవు. ఏవో దేశాలు, ఏవో మరికొన్ని దేశాల్ని దౌర్జన్యంతోనూ, దోపిడీ పద్ధతిలోనూ ఆక్రమించుకుంటున్నాయని అప్పుడప్పుడు ఆ నోటా ఆ నోటా వింటూ వుంటుంది.

"అయితే, ఈ యుద్ధం యిప్పుడు ఏ ఏ రాజ్యాల మధ్య జరుగుతున్నదండీ ?".

"జర్మనీ దేశం డాన్‌జిగూ తూర్పు ప్రష్యాకి మెట్టదారీ తనకి కావాలని పోలెండుని కోరింది. నయానా భయానా చెప్పిచూసింది. పోలెండు ససేమిరా అంటూ నిరాకరించింది. 'యుద్ధానికి సిద్ధమా ?' అని హుంకరించింది జర్మనీ. పోలెండు నానాజాతిసమితి శరణు జొచ్చింది. బ్రిటిష్ సామ్రాజ్యమూ, ఫ్రెంచి సామ్రాజ్యమూ జర్మన్ దౌష్ట్యాన్ని ప్రతిఘటించాలనే పట్టు

దలతో పోలెండు పక్షాన్ని జేరాయి. బ్రిటన్‌కీ, జర్మనీకీ వైరం సెప్టెంబరు మూడో తేదీనుంచీ ఆరంభమయింది..."

"మీరు చెప్పింది నాకేమీ అవగాహన మవడం లేదు. జర్మనీ డాన్‌జిగ్‌నే ఎందుకు కోరింది. మరింకే కోరికలు లేవా జర్మనీకి ?"

"చూడు-డాన్‌జిగ్ బాల్టిక్ రంగంలోని ప్రముఖ స్థలాలలో ఒక ప్రధాన రేవు పట్టణం."

"నన్ను వేధించ కండి—నాకు తెలీడంలేదు. ఒక్క డాన్‌జిగ్ కోసం బ్రిటిషు మహాసామ్రాజ్యమూ విశాల ఫ్రెంచి సామ్రాజ్యమూ జర్మనీతో యుద్ధానికి దిగడం దేనికండీ ?"

శాంతాదేవికి ప్రస్తుత రాజకీయ విషయాలగురించీ, బ్రిటిషు విదేశాంగనీతి గురించీ, నాజీ విధానం గురించీ పావుగంట ఉపన్యాసం యిచ్చాను. అంతావిని, "మన చక్రవర్తిగారు హానవర్ వంశీయులు కాదూ ?" అంది.

అవునన్నాను.

"ఆకుటుంబంఒకప్పుడు జర్మనీకిచెందినదికాదూ?"

"అవును. అయితే...? కురుక్షేత్ర సంగ్రామం ఎవరెవరికి జరిగింది ? పాండవులూ కౌరవులూ అన్న దమ్ములు కారూ ?"

"కొంత కాలానికి పూర్వం ఒక బ్రిటిషు ప్రధాన మంత్రి ఏదో దేశాన్ని హిట్లర్‌కి ఎరవేసి ప్రపంచ శాంతిని పట్టుకువచ్చాడని అందరూ అనుకున్నారే!?

"అవును. జకోస్లోవేకియాని జర్మనీ హస్తగతం చేశారు."

"ఆ శాంతిదేవత తోక ముడిచేసి, తుర్రున పారిపోయిందా ?" అంది శాంత, చిన్నగా నవ్వుతూ.

"పారిపోవడం కాదు, ఫలానా అని రాజకీయ విషయాలలో నిర్ధారణగా చెప్పలేం. ప్రతి స్వల్ప విషయానికీ అభిప్రాయ భేదాలు వుండడం సామాన్యం. విషయజ్ఞులలో పలువురు ఛాంబర్లేను రాజనీతీ, రాజకీయ దురంధరత్వమూ అమోఘమయినవని అంటున్నారు..."

"లేవండి. కంచం దగ్గిర్నుంచి లేవండి, హాయిగా కుర్చీలో కూచుని కబుర్లు చెప్పుదురు గాని, నేనింకా ఎంగిళ్లు ఎత్తాలి, కంచాలు కడగాలి—కళ్లెం పట్టులేని గుర్రంలా పరిగెడ్తుంది మీ వాగ్ధోరణి. లేవండి," అంటూ శాంతాదేవి నన్ను గదమాయించింది.

వాలుకుర్చీలో పడుకొని యుద్ధరాక్షసి విజృంభణాన్ని గురించి ఆలోచిస్తున్నాను.

భర్తల కోసం పలవరించే అనాధలూ, రత్నాల్లాంటి పుత్రుల్ని కోల్పోయిన తల్లిదండ్రులూ, వజ్రాల్లాంటి యువకుల్ని బలిపెట్టిన దేశాలూ—ఇవీ మనకి యుద్ధానంతరం కనిపించే దృశ్యాలు. గత ఐరోపా మహాసంగ్రామం సర్వప్రపంచానికీ ఒక గుణపాఠం నేర్పగలిగింది. కాని, దాని విలువని పాతికసంవత్సరాలు గడవకుండా మర్చిపోయింది మానవజాతి.

మళ్లీ యిప్పుడు యింకో బ్రహ్మాండమైన సుడిగుండంలో వున్నాం. అదృష్టవశాత్తూ తేలుతామో, పాతాళానికి కుంగిపోతామో అన్న విషయం కాలగర్భంలో దాక్కున్న రహస్యం. అవకాశాల్ని, అనుభ

వాళ్ళీ పురస్కరించుకుని అంచనా వెయ్యగలమే గాని భవిష్యత్తుని నిర్ణయించలేం కదా!

భాగ్యతో పునాది కట్టుకుని చమురుతో తేలే యంత్రనాగరికత మునుపటి కన్న యిప్పుడు ఎక్కువ మారణసాధనాలు కనిపెట్టగలిండి. శాస్త్ర పరిశోధన మారణక్రతువుకి కావలసిన సాధనసామగ్రి సమకూర్చడంలో తోడ్పడింది. యంత్రనాగరికత మానవుణ్ణి ఏమయినా సుఖపెట్టగలిగిందా అంటే, లేదని చెప్పవలసి వస్తోంది.

రయిలూ, మోటారూ, విమానమూ మానవుడికి శాంతినీ హాయినీ చేకూర్చాయని అనుకోవడం వొట్టి పొరబాటు. యంత్రనాగరికత ఉన్నత స్థితిలో వున్న ఈ నాడు మానవుడు తిండికోసం, బట్టకోసం పడుతున్న అష్టకష్టాలూ ఎప్పుడూ అనుభవించి వుండడు. ఇంత వరకూ మనం రెండు పరిమాణాలలో జరిగే యుద్ధాన్నే గమనించాం. ప్రస్తుతయుద్ధం మూడు పరిమాణాల యుద్ధం. నావికాబలమూ, సేనావాహినులూ కాక విమానదళం ఈయుద్ధంలో ప్రముఖస్థానం వహిస్తుంది...

దారుణ భయార్తారావాలు! పేలేమ స్ఫోటాలు! పీనుగపెంటలు! మృత్యుదేవత వికట వికృత రాక్షస నృత్యం!

శాంతాదేవి, "ఏమిటండీ ఆలోస్తున్నారు?" అంది, పాందాను టీపాయి మీద పెట్టి. తను యింకో కుర్చీనా కుర్చీకి దగ్గిరగా లాక్కుని, తమలపాకులు చీలుస్తో కూచుంది.

"యుద్ధం గురించి."

గోడని వున్న గడియారం రెండూ కొట్టింది. ఇందాకటి పిల్లి కిటికీ వెనక నుంచి మేమంత రాత్రి దాకా నిద్ర పోకుండా వుండడం తన కిష్టంగా లేదన్నట్లు—ఒక్క పర్యాయం తొంగి చూసింది. బీరువా వెనక నివసిస్తూ వున్న ఎలక ఒక్కసారి చిన్న చప్పుడు చేసింది.

"శాంతా, ఆసియా దేశాలలోని సామాన్య ప్రజల బాధలు తలుచుకుంటే నా గుండె నీరవుతోంది."

చూపుడు వేలితో బుగ్గ మీద కొడుతూ, "కొత్త కనక యిలా అనిపిస్తోంది. కొన్నాళ్లకి అలవాటై పోతుంది లెండి," అన్నది. ఎంతటి భయంకర సత్యం!

అక్టోబరు నెలాఖరుకి యుద్ధవార్తలంటే అంతకి పూర్వం వుండే ఆసక్తి సన్నగిలిపోయింది. ఏవో కొన్ని వోడలు మునిగిపోయాయనీ, కొన్ని వందలమందో వేలమందో చనిపోయారనీ హోటల్ కాఫీ తాగుతూనో, క్లబ్బులో పేక ఆడుతూనో, శాంతాదేవితో చదరంగపు ఎత్తులు వేస్తూనో బాతాఖానీ రూపంలో చెప్పుకోవడం అలవాటై పోయింది; పరిపాటై పోయింది.....

రచన: డిసెంబరు 41—ముద్రణ: 'ఆనందవాణి', 3-10-43

కథా నిలయం
4890
శ్రీకాకుళం